www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 6 మార్చి 2025



ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

సిఐ బి.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు జీలుగుమిల్లిలో జరగనున్న జగదాంబ ఉత్సవాల్లో పోలీస్ నిబంధనలను అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం ఉత్సవాలకు సంబంధించి మీడియాతో మాట్లాడారు.

పోలీస్ నిబంధనలను అతిక్రమించి ఉత్సవాల్లో దురాచారాలకు తెరలేపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టామన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ వి.నవీన్‌కుమార్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బొండాలకు భలే గిరాకీ..!

వేసవి తీవ్రత నేపథ్యంలో జోరుగా అమ్మకాలు

ప్రజాశక్తి - కాళ్ల

వేసవిలో ప్రకృతి వరప్రసాదంగా భావించే కొబ్బరి బొండాలు ఎండల తీవ్రత నుంచి ఉపశమనం ఇవ్వడంతోపాటు ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయి. ఈసారి ఫిబ్రవరి నెలాఖరు నుంచే ఎండల తీవ్రత పెరగ్గా మార్చి మొదటి వారంలోనే 38 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడం జనాలను బెంబేలెత్తిస్తోంది. దీంతో వేసవి ఎండల తీవ్రత నుంచి ఉపశమనం వైపు జనం పరుగులు తీస్తున్నారు. శీతల పానీయాల వైపు ప్రధానంగా కొబ్బరి బొండాల వైపు మొగ్గు చూపుతున్నారు. వేసవిలో మనిషిలోని నీటి శాతం ఎండతీవ్రతకు చెమట రూపంలో పోతుంది. దాంతో చర్మం పొడిబారి ఎన్ని లీటర్ల నీరు తాగినా దాహం తీరని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ఒక బొండాం తాగితే కచ్చితంగా ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందొచ్చు. రోడ్ల పక్కన చెట్ల నీడలో, బండ్ల మీద కొబ్బరిబొండాలు జోరుగా విక్రయిస్తున్నారు. చిన్న వ్యాపారాలు కనిపించినా ఒక్కో దుకాణంలో రోజుకి దాదాపు ఐదారు వేల రూపాయల వ్యాపారం జరుగుతుందంటే అతిశయోక్తి కాదు. మార్కెట్లో లీటర్ కొబ్బరినీళ్ళు రూ.100 నుంచి రూ.120వరకు ధర పలుకుతోంది. జిల్లాలోనే రోజుకు సుమారు లక్ష లీటర్ల కొబ్బరి నీళ్ళ అమ్ముడవుతున్నాయని అంచనా. వేసవి మూడు నెలల్లో జిల్లాలో సుమారు రూ.50 కోట్ల వ్యాపారం జరుగుతుందనేది ఒక అంచనా. జబర్ మిల్క్, జ్యూస్, నిమ్మకాయ సోడా, సుగంధి సోడా, పండ్ల రసం ఇలా పలు రకాలు జిల్లాలో ఈ సమ్మర్‌లో జోరుగా విక్రయాలు సాగుతున్నాయి. ఈ లెక్కన చూస్తే స్థానిక పానీయాల వ్యాపారమే వేసవిలో జిల్లాలో రూ.పది కోట్ల వరకూ సాగుతుందని అంచనా.



కొబ్బరిబొండాల విక్రయం



కొబ్బరిబొండాలు దిగుమతి చేసుకుంటున్న వ్యాపారి

బొండం అంటే పేదోళ్లకు భారమే

కొబ్బరి బొండాలు సామాన్యుడు కొనుగోలు చేసి తాగాలంటే రేట్లు చూసి నోరు తడారిపోతుంది. ఒక కొబ్బరిబొండం ధర రూ.20 నుంచి రూ.30 వరకూ పలుకుతోంది. కొబ్బరినీళ్లు లీటరు ధర రూ.100, అర లీటరు రూ.50కు అమ్ముతున్నారు. ఈ ధరలకు నిరుపేదలు బొండం నీళ్లు కొనుగోలు చేయలేని పరిస్థితి.

కొబ్బరి బొండం వల్ల ఉపయోగాలు

వేసవి ఎండ తీవ్రత నుంచి బయటపడడానికి కొబ్బరినీళ్లను తాగాల్సిందే. కొబ్బరినీళ్లు తాగిన వెంటనే శరీరంలోని రక్తనాళాల్లో నీరు చేరి గ్లూకోజ్‌గా మారి శరీరానికి శక్తినిస్తుంది. ప్రతియేటా మార్చి నుంచి మే నెల వరకు ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో చిరు వ్యాపారులు పుచ్చకాయలు, కొబ్బరిబొండాలు, నిమ్మకాయరసం, సోడాలు, చెరకురసం, కూల్‌డ్రింక్స్ విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటారు.

కొనుగోలు ధరలే అధికపోతున్నాయి

కె.మనోజ్, చిరువ్యాపారి, జువ్వలపాలెం

చిన్నవి, పెద్దవి కలి సగటున వంద కొబ్బరికాయల ధర రూ.రెండు వేలు పైబడి ధర ఉంది. జంగారెడ్డిగూడెం నుంచి కొబ్బరికాయలు కొనుగోలు చేస్తాం. కొబ్బరిబొండం రూ.30 అమ్మితేగానీ గిట్టుబాటయ్యే అవకాశాలు లేవు.

మోడీ రైతు వ్యతిరేక విధానాలపై అన్నదాతల ఆగ్రహం

ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరుఅర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) దేశవ్యాప్త పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల జిల్లా సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, రైతుల పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, రైతాంగ వ్యతిరేక విధానాలు విడనాడాలని నినదించారు. ఈ సందర్భంగా ఏపి రైతుసంఘం (అన్నే భవనం) రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, రైతుకూలీ సంఘం (ఏపి) రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ భాషా, బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏపి రైతుసంఘం (స్ఫూర్తి భవనం) జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2021లో ఢిల్లీ రైతు ఉద్యమ విరమణ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. మద్దతు ధరలు, రైతులకు ఆర్థిక తోడ్పాటు వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వం నియమించిన పార్లమెంటరీ కమిటీ చేసిన సూచనలు అమలు కాలేదన్నారు. విద్యుత్ సవరణ చట్టాన్ని యథాతథంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. మొత్తం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించటానికి మరొక మూడు పథకాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల అజమాయిషీలో ఉన్న ప్రాథమిక సహకార సంఘాలను, పాడి రైతుల సహకార సంఘాలను, మత్స్యకార సహకార సంఘాలను పెట్టుబడిదారులకు అప్పగించేందుకు చట్టం చేసిందన్నారు. డిజిటల్ అగ్రి మిషన్ పేరుతో 11 కోట్ల మంది రైతులను కార్పొరేట్ కంపెనీల గొడుగు కిందికి చేర్చడానికి పథకం రూపొందించిందన్నారు. నేషనల్ ఫ్రైమ్ వర్క్ పాలసీ ఆన్ అగ్రికల్చర్ మార్కెటింగ్ పేరుతో కార్పొరేట్లకు అనుకూలంగా మార్కెట్ చట్టాల్లో సవరణ తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ చట్టాల ప్రకారం పంటలకు మద్దతు ధరల విధానమే ఉండదన్నారు. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని చెప్పారు. ధరల స్థిరీకరణ నిధి ఉండదన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ బోర్లు అన్ని విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తుందని గుర్తు చేశారు. జిల్లాలో మిర్చి, పత్తి, కోకో, మినుములు, పెసలు వంటి పంటల ధరలు పతనమై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి మామిడి ధర పడిపోయిందని, మిర్చికి ప్రకటించిన ధరల వ్యత్యాస పథకం రైతులకు ఏమాత్రం ప్రయోజనం కాదన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ఇంకా ప్రారంభించలేదని, సాగునీటి ప్రాజెక్టులు, పంట కాలువలు, డ్రెయిన్ల నిర్వహణ ప్రయివేట్ సంస్థలకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రైతులకు అందలేదన్నారు. అన్ని పంటలకు మద్దతు ధరల అమలు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణమాఫీ చేయాలి, కేరళ తరహాలో రైతు రుణవిమోచన చట్టం చేయాలన్నారు. ఉపాధి హామీ పనులను విస్తరించాలని, 200 రోజుల పని దినాలు, రూ.600 కూలి అమలు చేయాలని కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి వెంటనే పూర్తి చేయాలని,పోలవరం నిర్వాసితులకు పునరావాసం వెంటనే కల్పించాలన్నారు. ఏజెన్సీలో జిసిసిని బలోపేతం చేసి గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, చింతపండు, జీడిమామిడి తదితర గిరిజన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ధర్నా అనంతరం డిఆర్ఒకు రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు ఘంటా పాపారావు, పి.సుభాష్ చంద్రబోస్, గండి రాజా, పి.పరమేశ్వరరావు, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, కొమరం రామారావు, సాంధ్రు గంగాదేవి, కూచిపూడి నాగేశ్వరరావు, గోలిమే బాల యేసు, పొట్టేలు పెంటయ్య, గుదే ఆశీర్వాదం, పుప్పాల కన్నబాబు, బొల్లు రామకష్ణ, గుదిబండి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న నేతలు, అన్నదాతలు

మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహిద్దాం

అధికారులతో సమీక్షించిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో మహిళా దినోత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన ఏలూరు సిఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన వివిధ శాఖల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో సుమారు 25 స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. చేనేత వస్త్రాలు, హస్తకళలకు సంబంధించిన స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. మహిళల్లో చైతన్యం కలిగించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీనికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీనిలో భాగంగా 2కె మారథన్, సైకిల్ ర్యాలీ వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళలకు హెల్త్ చెకప్ శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా కేన్సర్ స్క్రీనింగ్‌కు సంబంధించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. న్యూట్రిషన్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. వివిధ రంగాల్లో సత్తా చాటుతున్న మహిళలను సన్మానించాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్‌తోపాటు మొక్కలు పెంచేందుకు అనువుగా ఉన్న అన్ని కార్యాలయాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలన్నారు. మహిళా దినోత్సవ కార్యక్రమంలో మహిళలతోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులందరూ తప్పక హాజరు కావాలని సూచించారు. సమావేశంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, ఐసిడిఎస్ పీడీ పి.శారద, డిఎస్‌పి శ్రావణ్ కుమార్, డిసిపిఒ డాక్టర్ సూర్యచక్రవేణి, ఇరిగేషన్ ఎస్ఇ పి.నాగార్జునరావు, ఎల్‌డిఎం డి.నీలాద్రి, పరిశ్రమల కేంద్రం జిఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, వ్యవసాయశాఖ జెడి హబీబ్ భాషా, ఉద్యానశాఖ డిడి రామ్మోహన్, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఆర్‌వి.నాగరాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

దళితవాడల్లో శ్మశానాల ఆక్రమణపై సమగ్ర దర్యాప్తు చేయాలి

వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దళితవాడల్లో శ్మశానాల ఆక్రమణపై సమగ్ర దర్యాప్తు జరపాలని, దళితులకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి కోరారు. బుధవారం స్థానిక అన్నే వెంకటేశ్వరరావు భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ముఖ్యఅతిథి రవి మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు, దళితులు, గిరిజనుల స్థితిగతులు రోజురోజుకీ దిగజారిపోతున్నాయన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుంటే పేదల బతుకులు మాత్రం పాతాళంలోకి పోతున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు గాలికొదిలేసి పేదలపై భారాలు వేస్తున్నాయని మండిపడ్డారు. 2004లో అప్పటి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం దళితవాడలకు శ్మశానాలు అభివృద్ధి చేసేందుకు జిఒ నెం.1235 తీసుకొచ్చినా నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. దీనిని పాలకులు అమలు చేయకపోవడంతో దళితులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఏలూరు జిల్లాలోనే దళితుల శ్మశాన భూములను భూస్వాములు, దళారులు అక్రమంగా, దౌర్జన్యంగా ఆక్రమించుకొని దళితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. మనిషి పుట్టిన దగ్గర నుండి చచ్చేంత వరకు దళితుల పట్ల వివక్ష చూపుతూనే అసలు వివక్ష ఎక్కడ ఉందని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దళితుల శ్మశానాల రక్షణ కోసం రాబోయే కాలంలో పెద్దఎత్తున ఆందోళన, పోరాటాలకు సన్నద్ధమవుతామని హెచ్చరించారు. పేదల ఇళ్ల నిర్మాణం కోసం మూడు సెంట్లు స్థలం, ఆరు లక్షల నగదు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఉండాలన్నారు. ఉపాధి హామీ చట్ట రక్షణ కోసం వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతుందని, దీనిలో తీసుకొచ్చిన మార్పులను తొలగించి, పాత పద్ధతిలోనే పనులు కల్పించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు సమస్యలు పరిష్కరించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ పేదల భూములను భూస్వాములకు కట్టబెట్టేలా జిల్లాలో రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దెందులూరు మండలం దోసపాడు, పోతునూరు, కొవ్వలి, పెదవేగి మండలంలో మొండూరు, విజయరాయి, వేగివాడ, జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం, తాడువాయి, పంగిడిగూడెం, టి.నర్సాపురం మండలం ఏపుగుంట, చింతలపూడిలో అన్యాక్రాంతమైన అసైన్డ్, సీలింగ్ భూములు పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న విజయవాడలో ధర్నా చౌక్ వద్ద చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వై.నాగేంద్రరావు, తామా ముత్యాలమ్మ, ఎస్.మహంకాళిరావు, ఉడతా వెంకటేష్, మడకం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 98 శాతం హాజరు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.యోహాన్ తెలిపారు. మొత్తం 55 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 14,241 మంది విద్యార్థులకుగాను 13,890 మంది హాజరయ్యారని, 98 శాతం హాజరు నమోదైందని తెలిపారు. 351 మంది గైర్హాజరయ్యారు. సాధారణ విభాగంలో 12,435 మందికి 12,207 మంది హాజరవ్వగా 228 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో మొత్తం 1,806 మందికి 1,683 మంది హాజరవ్వగా 123 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు యోహాను తెలిపారు.

అంగన్వాడీల్లో పౌష్టికాహారం అందించాలి

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - భీమడోలు

అంగన్వాడీ కేంద్రాల్లో మహిళలు, పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించిన పౌష్టికాహారం అందించాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలో ఆమె బుధవారం సుడిగాలి పర్యటన చేసి వివిధ శాఖల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాతూరులోని ఎంపిపి స్కూల్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని జెసి సందర్శించారు. అక్కడ మహిళలు, పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ధాత్రిరెడ్డి మాట్లాడుతూ మహిళలు, పిల్లల్లో పౌష్టికాహారలోపం, రక్తహీనత నివారించడం ద్వారా మాతా, శిశు మరణాలు అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పౌష్టికాహారాన్ని మహిళలు, పిల్లలకు అందించేలా అంగన్వాడీ సిబ్బంది పని చేయాలన్నారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి వ్యాక్సినేషన్ చేయించాలన్నారు. అంగన్వాడీలోని ప్రీ స్కూల్‌లో పిల్లలకు విద్య పట్ల ఆసక్తి కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఏలూరు కాలువలో తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులను జెసి పరిశీలించారు. పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసి శివారు గ్రామాలకు తాగు, సాగు నీరు అందేలా చూడాలన్నారు. అనంతరం గుండుగొలనులో ఎండియు వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీని పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రేషన్ అందించాలన్నారు. అనంతరం సూరప్పగూడెంలో రీసర్వే పనులను పరిశీలించారు. భీమడోలు తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని రికార్డులను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ వెంట ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, ఇరిగేషన్ ఎస్ఇ పి.నాగార్జునరావు, సర్వే ఎడి అన్సారీ, తహశీల్దార్ రమాదేవి, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



అంగన్వాడీలో జెసి ధాత్రిరెడ్డి

నాటుసారా నిర్మూలనకు కృషి చేయాలి

నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించిన ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నాటుసారా నిర్మూలనకు అందరూ కృషి చేయాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్, డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, స్టేట్ టాస్క్ ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ వివేక్‌యాదవ్, ఏలూరు డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, ఏలూరు అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ కెవిఎన్.ప్రభుకుమార్ అన్నారు. నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయాన్ని వారు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎబిసి కేటగిరిలో ఉన్న నిందితులను బైండోవర్ చేయాలన్నారు. సారా తయారీదారులకు బెల్లం సరఫరా చేసేవారిపై కేసులు నమోదు చేయాలన్నారు. నాటుసారా నిర్మూలనకు సిబ్బందికి కేటాయించిన గ్రామాల్లో సచివాలయ సిబ్బందితో నిఘా పెట్టి సమాచారాన్ని సేకరించి దాడులు చేయాలని సూచించారు. సారా తయారీ క్రయవిక్రయాల గురించి సమాచారాన్ని 14405 టోల్ ఫ్రీ నెంబర్‌ను అందరికీ తెలియజేయాలని సూచించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఉన్నతాధికారులు

నిర్వాసితుల భూములెక్కడో నిగ్గు తేల్చాలి

అసెంబ్లీలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

దళారుల చేతుల్లో ఉన్న నిర్వాసితుల భూముల నిగ్గు తేల్చాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా పోలవరం నిర్వాసితుల సమస్యలను గాలికొదిలేశారన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ నిమిత్తం సుమారు రూ.వంద కోట్లు కేటాయించినట్లు గుర్తు చేశారు. కొన్ని గ్రామాల్లో పరిహారం అందాల్సి ఉందని, వారికీ పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిర్వాసితులకు కేటాయించిన భూములను కొంతమంది దళారులు తక్కువ ధరకు తీసుకొని స్థానిక గిరిజనేతరులకు అధిక ధరలకు కౌలుకు ఇస్తూ లక్షలు గడిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ముంపు మండలాలైన పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడుల్లోని గ్రామాల్లో కలెక్టర్ స్థాయి అధికారి పర్యటించి నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

గుర్తింపు నిల్.. పని భారం ఫుల్

ఆశాల ఆవేదన

సమస్యల పరిష్కారానికి నేడు చలో విజయవాడ

ప్రజాశక్తి - నరసాపురం

ఏవండి ఆరోగ్యం ఎలా ఉంది ? మందులు వేసుకున్నారా? సమయానికి తినండి, ఏదైనా బాగోలేకపోతే దగ్గర్లో ఉన్న ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చూపించుకోండి. పరీక్షలు చేయించుకుని డాక్టర్ గారు చెప్పిన మందులు వాడండి. మీ బాబుకి ఎలా ఉంది? వ్యాక్సిన్, టీకాలు వేయించారా? మామగారు మీకు దగ్గు తగ్గిందా? ఒకసారి సిహెచ్‌సికి రండి అన్ని టెస్టులు చేస్తారు. ఇలా గర్భవతి నుంచి బాలింతలు, చిన్న పిల్లలు, వృద్ధుల వరకు అందరినీ పలకరిస్తూ నిత్యం ప్రజలతో మమేకమైపోతారు ఆశా కార్యకర్తలు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ముందుకు వెళ్తున్న వీరిని ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో జీతం పెరిగిందని ఆనందంలో ఉండేటప్పటికీ యాప్‌ల భారం పెంచారు. శక్తికి మించిన పనులు వీరి చేత చేయించి వీరిపై భారం మోపుతున్నారు. దగ్గర్లో ఉన్న పిహెచ్‌సిలోను, అర్బన్ పిహెచ్‌సి, సచివాలయంలోను వీరిచేత పనులు చేయిస్తున్నారు. వీరిని ఆన్‌లైన్ చేయాలని కొన్నిచోట్ల ఒత్తిడికి గురిచేస్తున్నారు. 2023వ సంవత్సరం డిసెంబర్ 14, 15వ తేదీల్లో భీమవరం కలెక్టరేట్ వద్ద వీళ్ల చలిలో దీక్ష, వంటా వార్పు కార్యక్రమం చేశారు. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదు. దీంతో 2024లో ఫిబ్రవరి 8వ తేదీన చలో విజయవాడకు పిలుపునిచ్చారు. అప్పుడు మహిళా పోలీసులు నోటీసులు ఇచ్చి భయపెట్టారు. కరోనా టైంలో వారి ప్రాణాలను తెగించి వైద్యసేవలు అందించారు. అయితే వీరికి భద్రత లేదు, వీరి ఆరోగ్యానికి ఇన్సూరెన్స్ లేకుండా పోవడంతో చాలామంది ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి నష్టపరిహారం రాలేదని ఆశా కార్యకర్తలు వాపోతున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత జీతం పెంచింది కానీ సేవలు పెరిగాయి. నాణ్యత లేని ఫోన్లు ఇచ్చి వీరి చేత యాపుల్లో సర్వేలు, వైద్య సేవలు చేయిస్తున్నారు. గతంలో వీరి నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి తడికలపూడిలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి శిక్షణ ఇచ్చేవారు. ఇప్పుడు ప్రభుత్వం ఆ శిక్షణ నిలిపివేసింది. యాప్‌లోను లాగిన్ అవ్వాలని, లేట్ అవుతే డిఎంహెచ్ఒ కార్యాలయం నుంచి ఫోన్లు వస్తాయని వీళ్ల ఆవేదన చెందుతున్నారు. టెస్టుల పేరుతో రాత్రి సమయంలో పనులు చేయించిన రోజులు కూడా ఉన్నాయంటున్నారు. గ్రామ సచివాలయంలో నిత్యం హాజరవ్వాలని, వారికి సంబంధం లేని పనులు కూడా చేయాలని కార్యకర్తలపై ఉద్యోగులు ఒత్తిడి చేస్తున్నారు. ఉద్యోగ విరమణ పొందిన, చనిపోయిన కార్యకర్త స్థానంలో కొత్త కార్యకర్త రిక్రూట్మెంట్ జరగడం లేదు. దీంతో పక్క గ్రామంలోని చాలా వార్డుల్లోని ఆశాలకే ఈ పనిభారం కూడా పడుతుంది. కొందరు ఈ ఒత్తిడి తట్టుకోలేక ఉద్యోగాలు సైతం రిజైన్ చేస్తున్నారు. ఒకే ఆశ కార్యకర్త తన ఏరియాతో పాటు అదనంగా పనులు చేస్తున్నారు. దీనికి ప్రత్యేక అలవెన్సు కూడా ఇవ్వడం లేదు. మరోవైపు కార్మికులను గుర్తించడం లేదని, ప్రభుత్వ ఉద్యోగం చెప్పి ప్రభుత్వ పథకాలను వర్తింప చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 60 సంవత్సరాలు పూర్తయిన తర్వాత ఆశలకు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రావడం లేదు. దీంతో వారి శేష జీవితం ప్రశ్నార్థంగా మారింది. ఆశా కార్యకర్తలు 30కుపైగా రికార్డులు నిర్వహిస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. అత్యవసర సమయాల్లో సెలవులు కోరుతున్నా వైద్యాధికారులు సెలవులు మంజూరు చేయడం లేదని వాపోతున్నారు.

గత ప్రభుత్వం సమయంలో ఆశా కార్యకర్తలను అరెస్టు చేసినప్పుడు కూటమి నాయకులు ఆశా కార్యకర్తలకు మద్దతుగా నిలిచారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ సైతం ఇచ్చారు. గడిచిన సాధారణ ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆశా కార్యకర్తలు తమ నియోజకవర్గ ఎంఎల్ఎల దృష్టికి తమ సమస్యలను వివరించి, వినతి రూపంలో తీసుకుని వెళ్లారు. 2024 సెప్టెంబర్ 5వ తేదీన జిల్లాలోని అన్ని పిహెచ్‌సిల వద్ద వైద్యాధికారులకు ఆశా కార్యకర్తలు మినిట్స్ కాపీని వినతిపత్రం రూపంలో అందజేశారు. నవంబర్ 18వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద చలో కలెక్టరేట్ కార్యక్రమం సైతం నిర్వహించి డిఎంహెచ్ఒలకు వినతి పత్రాలు అందజేశారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో మార్చి ఆరో తేదీన చలో విజయవాడ కార్యక్రమంకు పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలపై జరిపిన జాయింట్ మీటింగ్‌లో ఇచ్చిన ఒప్పందాలకు జిఒల రూపంలో వెంటనే ఇవ్వాలని కోరుతున్నారు.



ఆశాల ధర్నా(ఫైల్ ఫోటో)

8న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు అర్బన్ : ఈ నెల ఎనిమిదో తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ యోగ్యమైన క్రిమినల్ కేసుల పరిష్కారం నిమిత్తం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ బుధవారం ఏలూరు, జంగారెడ్డిగూడెం, భీమడోలు, చింతలపూడి కోర్టుల పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి పోలీసులు కక్షిదారు లతో సంప్రదింపులు జరపాలన్నారు. చిన్నచిన్న భేదాభిప్రాయాలు ఉంటే పర్మినెంట్ లోక్ అదాలత్ ఛైర్మన్ చే కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ చేయనున్నట్లు తెలిపారు.

డ్రెయినేజీలో పూడిక తీత

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చింతలపూడి

డ్రెయినేజీలో నీరు నిల్వ లేకుండా అధికారులు పూడికలు తీయించారు. అస్తవ్యస్తంగా డ్రెయినేజీ శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. దోమల నివారణకు బ్లీచింగ్, సున్నం చల్లినట్లు తెలిపారు. దోమల మందు పిచికారీ చేస్తామని ఇఒపిఆర్‌డి జెఎం.రత్నకుమార్ తెలిపారు.

12న చలో విజయవాడ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉపాధి హామీ, వ్యవసాయ కార్మికుల డిమాండ్ల సాధనకు మార్చి 12న జరిగే చలో విజయవాడ మహాధర్నాకు పేదలంతా తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో చలో విజయవాడ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎం.జీవరత్నం మాట్లాడుతూ పేదలకు అన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టానికి బిజెపి ప్రభుత్వం డబ్బులు తగ్గించిందని, కూటమి ప్రభుత్వం ఉపాధిని వ్యవసాయానికి అనుసంధానం చేసి పేదల పొట్ట కొట్టిందని చెప్పారు.

బుట్టాయగూడెం :ఈ నెల 12వ తేదీన విజయవాడలో జరిగే మహాధర్నాకు ఉపాధి హామీ కూలీలు కలిసి రావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తామా ముత్యాలమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని కోట నాగవరం పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పని చేస్తున్న ఉపాధి హామీ కార్మికులను ఆమె బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంద రోజులు ఉపాధి పని పూర్తి చేసుకున్న గ్రామీణపేదలకు అదనంగా పనిదినాలు, సమ్మర్ అలవెన్స్, పే స్లిప్పులు, పెండింగ్ వేతనాలు ఇవ్వాలన్నారు. విజయవాడలో భారీగా చేపట్టిన ధర్నాకు ప్రతి గ్రామం నుంచి పేదలు పెద్ద ఎత్తున కదిలి రావాలని కోరారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గ్రామీణ పేదలకు ఉపాధి హామీ చట్టం ద్వారా పనులు కల్పించి వలసలను నివారించాలని కోరుతూ బికెఎంయు రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. అనంతరం గ్రామీణ పేదల వలసలు నివారించాలని, ఉపాధి హామీ పనులు కుటుంబానికి సంవత్సరానికి 200 రోజులు కల్పించాలని, రోజు కూలి రూ.700 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డిఆర్‌ఒకు విజ్ఞాపన పత్రం అందించారు. ఈ సందర్భంగా బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు బకాయి పడ్డ కూలీ డబ్బులు తక్షణమే చెల్లించాలని కోరారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవం జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాల సమన్వయకర్త, ఎపిఎస్‌ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన పిఠాపురంలోని చిత్రాడాలో జరగనున్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ సభకు ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాల సమన్వయకర్తగా తనకు బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

పొగాకు రైతుకు నష్ట పరిహారమివ్వాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లిలో ఇటీవల ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగి పొగాకు బ్యారన్ దగ్ధమై నష్టపోయిన రైతు కొప్పుల ప్రసాద్‌కు వెంటనే నష్టపరిహారం అందించాలని పోలవరం మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన బాధిత రైతును ఇంటికెళ్లి పరామర్శించారు. అనంతరం దర్భగూడెంలో జరుగుతున్న భూలక్ష్మి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సున్నం ఉషారాణి, సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు, సందా ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, సుధారాణి, ఉప సర్పంచి కేతిరెడ్డి రాఘవరెడ్డి, సత్యనారాయణ, పాండు, చౌదరి రెడ్డి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పొగాకు బ్యారన్‌లు దగ్ధం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని రాచన్నగూడెం గ్రామానికి చెందిన విర్నల సత్యనారాయణ, సింగలదేవి అర్జునరావు రైతులకు చెందిన బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ఒక బ్యారన్‌లో మంటలు చెలరేగాయి. స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అదుపులోకి రాకపోవడంతో పాటు రెండో బ్యారన్‌కు కూడా మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో రెండు బ్యారన్‌లు దగ్ధమయ్యాయి. ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా సమయానికి రాకపోవడంతోనే రెండు బ్యారన్ లు దగ్ధమైనట్లు బాధితులు వాపోతున్నారు. ఈ ప్రమాదంలో పొగాకుతో పాటు బ్యారన్ సామగ్రి కలిపి రూ.ఐదు లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోతున్నారు.

రైల్వే గేటును ఢీ కొన్న ట్రాక్టర్

విరిగిపోయిన గేటు : డ్రైవర్‌పై కేసు

ప్రజాశక్తి - మండవల్లి

వేగంతో వస్తున్న ట్రాక్టర్ మూసి ఉన్న రైల్వే గేటును ఢీ కొట్టడంతో రైల్వే గేటు విరిగిపోయింది. ఈ ఘటన చావలిపాడు గేటు వద్ద బుధవారం ఉదయం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండవల్లి-కైకలూరు మార్గమధ్యంలో చావలిపాడు వద్ద ఉన్న 79వ రైల్వే గేటును గూడ్స్ రైలు వెళ్లే నిమిత్తం 9:20 గంటల సమయంలో గేట్‌మేన్ ఎం.శివాజీ గేటు వేస్తున్నాడు. గేటు వేస్తున్నట్లు వస్తున్న సైరన్‌ను గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ గేటును దాటేయాలనే ఉద్దేశంతో స్పీడ్‌గా వచ్చి రైల్వే గేటును బలంగా ఢీకొట్టాడు. దీంతో రైల్వే గేటు విరిగిపోయింది. ఇది గమనించిన గేట్‌మేన్ శివాజీ ట్రాక్టర్‌ను నిలుపదల చేసి గూడ్స్ వెళ్లే క్రమంలో ఎటువంటి ప్రమాదం సంభవించకుండా గేటుకు బదులుగా ఇనుప చైన్‌ను అడ్డంగా ఉంచాడు. గూడ్స్ రైలు వెళ్లిన తర్వాత రైల్వే స్టేషన్‌కు సమాచారం అందించాడు. స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైల్వే గేటు విరిగిన పరిస్థితిని పరిశీలించారు. గేటుకు మరమ్మతులు చేయించి గేట్‌మేన్ శివాజీ ఇచ్చిన ఫిర్యాదుపై ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎఎస్‌ఐ రామయ్య తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న వ్యాన్

ప్రజాశక్తి - మండవల్లి

ఐసర్ వ్యాన్ ఢీకొని విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సంఘటన నీలగిరి పట్టణంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... జాతీయ రహదారి పామర్రు దిగుమరు 165 పక్కనే నీలగిరి పట్టణం వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని కైకలూరు నుంచి ముదినేపల్లి వైపు వెళ్తున్న ఐసర్ వ్యాన్ బుధవారం తెల్లవారుజామున సుమారు 3:30 గంటల సమయంలో బలంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో విద్యుత్ స్తంభం విరిగిపోయి విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఎఇ రామకృష్ణకు స్థానికులు సమాచారం అందించడంతో లైన్‌మేన్ మధుబాబు సంఘటన స్థలానికి చేరుకుని హుటాహుటిన విరిగిన ప్రాంతంలో వేరే కరెంటు స్తంభం ఏర్పాటు చేసి వైరకు పూర్తిస్థాయిలో మరమ్మతు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. తెల్లవారుజామున విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఫ్యాన్లు తిరగక దోమలతో ఉదయం ఉక్క పూతతో పిల్ల పాపలతో స్థానికులు నాన అవస్థలు పడ్డారు.

మద్యం సీసాలు స్వాధీనం

చింతలపూడి :అక్రమంగా మద్యం సీసాలు అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. లింగపాలెం మండలం వెస్ట్ యడవల్లి గ్రామంలో దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన పలగాని చెన్నారావు వద్ద నుంచి పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వెస్ట్ యడవల్లి గ్రామంలో నాటు సారా వల్ల జరిగే అనర్థాల గురించి వివరించేందుకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా, కలిగి ఉన్నా, విక్రయించినా టోల్ ఫ్రీ నెంబర్ 14405, లేదా ఎక్సైజ్ స్టేషన్ 9440902428 సమాచారం అందించాలని చెప్పారు.

ఇంటర్ పరీక్షకు వంద మంది హాజరు

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక అల్లూరి సీతారామరాజు జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్-2 పరీక్షకు వంద మంది విద్యార్థులు హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ నంబూరి గోపాలకృష్ణంరాజు తెలిపారు. మండలంలోని రెండు ప్రభుత్వ, ఒక ప్రయివేట్ కళాశాలల నుంచి 104 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా నలుగురు విద్యార్థులు గైర్హాజయ్యారన్నారు. మొత్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్-2 పరీక్షకు 96 శాతం మంది విద్యార్థులు హాజరై, పరీక్ష రాసినట్లు నంబూరి గోపాలకృష్ణంరాజు తెలిపారు.

మహిళా దినోత్సవ వారోత్సవాలు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండలంలోని వేలేరుపాడు సెక్టార్ పరిధిలో శివకాశిపురం సీతమ్మ అంగన్వాడీ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు సిడిపిఒ ప్రాజెక్ట్ అధికారిని లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంగన్వాడీ సెంటర్ నుంచి ఆశ్రం పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురించి వివరించారు. కిశోర బాలికల తల్లులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు.

చాట్రాయి :మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ మార్గదర్శకంలో నూజివీడు రూరల్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో చాట్రాయి ఎస్‌ఐ రామకృష్ణ సమన్వయంతో ఈ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు పోలీస్ అధికారులు ప్రత్యేక బహుమతులు అందించారు.

నూజివీడు టౌన్ : మండలంలోని గొల్లపల్లి శ్రీ అన్నేరామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, ఆరోగ్యం, మహిళల హక్కులు, చట్టాలు, కిశోర వికాశం ఒత్తిడి, నిర్వహణ, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం గురించి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అవగాహన కల్పించారు. మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం కిశోర్ బాలికలకు క్యాండిల్ సర్వీస్, ప్రతిజ్ఞ నిర్వహించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.రాధికారాణి తెలిపారు.

రామారావు మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన సిపిఐ మాజీ నాయకులు కొనకళ్ల రామారావు ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ సందర్భ:గా మక్కినవారిగూడెం గ్రామంలోని ఆయన నివాసం వద్ద బుధవారం పలువురు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సిపిఐ క్రియాశీల కార్యకర్తగా సేవలందించిన ఆయన మక్కినవారిగూడెం గ్రామపంచాయతీ ఉపసర్పంచిగా, సహకార సంఘ పాలకవర్గ సభ్యునిగా సేవలందించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టివిఎస్.రాజు, బిఎన్.సాగర్, షేక్ జాకీర్ హుస్సేన్, సబ్బి కనకారావు, ఎల్ఆర్.కృష్ణబాబు, వీరమల్ల సత్యనారాయణ, కంచర్ల గుర్వయ్య, టి.బాబు, దొంతా కృష్ణ, రామచంద్రారెడ్డి, సోమశేఖర్, రమేష్ రెడ్డి, పురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులందరూ సోదర భావంతో మెలగాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులందరూ సోదరభావంతో మెలగాలని ఎస్‌ఐ ఎం.జయబాబు తెలిపారు. మండలంలోని బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్త్రీ, పురుష సమానత్వంపై బుధవారం విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లితండ్రులకు బాలికల పట్ల చిన్న చూపు తగదన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, బాల బాలికలను సమానంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఆలీ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

11న చలో విజయవాడ

ప్రజాశక్తి - చింతలపూడి

మున్సిపల్ ఉద్యోగ కార్మికుల సమస్యల పట్ల చర్చించని అసెంబ్లీ సమావేశాలను ఎండగడుతూ ఈ నెల 11న చలో విజయవాడ ధర్నాచౌక్‌లో మహా ధర్నాను చేపడతామనివ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాస్ తెలిపారు. చింతలపూడి నగర పంచాయతీ యూనియన్ సమావేశం వెలగాడ అనురాధ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భజంత్రీ శ్రీనివాస్ మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయడానికి రాష్ట్రంలోని వివిధ మున్సిపల్, కార్పొరేషన్, నగర పంచాయతీ కార్మికులు, ఉద్యోగులు పెద్దఎత్తున కదలి రావాలని వారు పిలుపునిచ్చారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు టి.బాబు ,యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యులు బంగారు దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించరూ..!

లోపూడి గ్రామస్తుల వేడుకోలు

ముసునూరు :మండలంలోని లోపూడి గ్రామస్తులు లో ఓల్టేజీ విద్యుత్ సరఫరాతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంట్లో వాడే విద్యుత్ సరఫరాకు 220 వాట్స్ ఉండాలని, కనీసం 160 వాట్స్ కూడా ఉండడం లేదని, దీంతో ఫ్యాన్, లైట్లు, ఫ్రిజ్, గ్రైండర్లు, కుట్టు మిషన్లు పని చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా మరమ్మతులకు గురవుతు న్నాయని వాపోతున్నారు. వ్యవసాయ త్రీ ఫేస్‌లో మెటార్‌కు రావాల్సిన విద్యుత్ సరఫరా అందక నీరు సరిగా రాక పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యపై గతంలో ఉన్నతాధికారులకు పలమార్లు విన్నవించామన్నారు. లోపూడి శివారు బసవరప్పాడులో ఉన్న విద్యుత్ సబ్ సేష్టన్‌ను లోపూడి ఏరియాకు తరలించి, పిటిఆర్ టేపు



నీరందక ఎండిపోయిన పంటను చూపుతున్న రైతులు

ఛేంజర్‌ను కొత్తది అమర్చితే ఎక్కువ లోడ్ ఉన్నా సరిపోతుందని అధికారులు గత నాలుగేళ్ల నుంచి చెప్పడమే తప్ప ఆ మేరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు, రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవికి సిఎం అభినందన



వైష్ణవిని అభినందిస్తున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - ముదినేపల్లి

రాష్ట్రానికి అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా సిఆర్‌డిఎ ఉత్తర్వులను జారీ చేయగా అంబుల వైష్ణవి, ఆమె తండ్రి మనోజ్‌లు సిఎం చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి తన వంతుగా ధన సహాయం చేస్తూ, మండలంలోని పేద ప్రజలకు ఆపదలు వస్తే వారి కుటుంబాలకు తనవంతు సహాయ, సహకారాలను అందిస్తూ ముందుకు నడిపిస్తున్న డాక్టర్ మనోజ్, వైష్ణవిలను సిఎం చంద్రబాబు అభినందించారు. విద్యార్థులను, యువతను, రైతులను, అన్ని రంగాల్లో ఉన్న కార్మికులను, రాష్ట్రప్రజలను, ఉద్యోగులను, ఎన్‌జిఒలను, అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలను, కలుపుకొంటూ అమరావతి అభివృద్ధికి కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. అంబుల వైష్ణవి వైద్య విద్యనభ్యసించాలని, తన తండ్రి మనోజ్ సహాయ సహకారాలు, బంధు, మిత్రులు, యువత సహాయ సహకారాలు తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైష్ణవికి తమవంతుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి మాట్లాడుతూ కొత్త సంవత్సరం తెలుగువారి ఉగాది పండుగ అనంతరం రాష్ట్రాభివృద్ధి కోసం రాజ్య శ్యామల హోమాన్ని నిర్వహిస్తానని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అందరి సహాయ సహకారాలు అందిస్తారని ఆశాభావాన్ని వ్యక్తపరుస్తూ తదుపరి కార్యాచరణను వివరిస్తానని తెలిపారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

మంత్రి నిమ్మలను కోరిన ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి

ఏలూరు సిటీ :రానున్న వేసవిలో ఏలూరు నగరానికి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా నీటిపారుదల శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తగు చర్యలు చేపట్టాలని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఏలూరు నియోజకవర్గానికి సంబంధించి ప్రస్తుతం ఉన్న ప్రధాన సమస్యను ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నీటిపారుదల శాఖా మంత్రికి ఇదే అంశంపై విన్నవించామన్నారు. ఆయన ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడి తగు ఆదేశాలు జారీ చేయించారని, అయితే కిందిస్థాయి అధికారుల్లో సమన్వయ లోపం కారణంగా సమస్య పెద్దదిగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరుకు సమీపంలోని గోదావరి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో ఇంతకు ముందు 13.5 మీటర్ల నీటి సామర్థ్యం ఉండగా కిందిస్థాయి అధికారుల సమన్వయ లోపం కారణంగా ప్రస్తుతం అది 11.5 మీటర్లకు పడిపోయిందని చెప్పారు. తాను, కార్పొరేషన్ అధికారులు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును తనిఖీ చేసిన సమయంలో ఇరిగేషన్ శాఖ విజ్ఞప్తి మేరకు కాలువ మరమ్మతులకు రూ.ఐదు లక్షలను ఏలూరు కార్పొరేషన్ నుంచి కూడా కేటాయించామన్నారు. అయితే అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగా సమస్య పెద్దదిగా మారిందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు తీసుకోకపోతే వేసవిలో నీటిఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని చెప్పారు.

ఘనంగా లిటిల్ ఫ్లవర్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ముదినేపల్లి



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో పాటు సామాజిక బాధ్యతలను అర్థం చేసుకోవాలని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రిన్సిపల్ ఆర్‌వి.నాగరాజు అన్నారు. ముదినేపల్లిలోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 57వ వార్షికోత్సవం స్కూల్ ప్రాంగణంలో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సభా ప్రాంగణం కిక్కిరిసింది, సాంస్కృతిక ప్రదర్శనలు, పురస్కారాల విభాగాలు, ప్రేరణ ఉపన్యాసాలతో వార్షికోత్సవ వేడుకలు చైతన్యవంతంగా సాగాయి. ఈ కార్యక్రమం ప్రారంభంలో లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ కరెస్పాండెంట్ చిట్టూరి నితిన్, స్కూల్ ప్రిన్సిపల్ ఆర్‌వి.నాగరాజు, టిడిపి మండలాధ్యక్షులు శోభనాద్రి చౌదరి జ్యోతి ప్రజ్వలనం చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పారంపర్య నృత్యాలు, దేశభక్తి గీతాలు, పర్యావరణ, సంరక్షణపై స్కిట్లు, ఆధునిక నృత్యాలు ప్రేక్షకు లను మైమరిపించాయి. విద్యా, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సాధన చేసిన విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేశారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లోని విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు ఇతర క్విజ్ కార్యక్రమాల్లో చాలా చక్కగా తమ ప్రతిభను చూపించారు. అనంతరం ముఖ్య అతిథులను పూలమాలలు, దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఆనందరావు విశేష కృషి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయునిగా 36 ఏళ్ల కాలంలో ఎంతో కృషి చేసిన దుప్పల ఆనందరావు ఆదర్శనీయుడని పెంటపాడు ఎంఇఒ టివి.రామకృష్ణ అన్నారు. అక్కుపల్లి, గోకవరం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి గత నెల 28న ఉద్యోగ విరమణ పొందిన దుప్పల ఆనందరరావుకు అభినందన సభ బుధవారం నారాయణపురం లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించారు. కైకరం స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ గుళ్ల ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన సభకు పెంటపాడు ఎంఇఒ రామకృష్ణ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఆనందరావు గతంలో పనిచేసిన రాచూరు, నారాయణపురం, నీలాద్రిపురం, అక్కుపల్లి గోకవరం పాఠశాలల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని వక్తలు కొనియాడారు. ఎ.గోకవరం సర్పంచి మిద్దే సత్యవతి మాటా ్లడుతూ ఆనందరావు మాస్టారు వచ్చాకే తమ పాఠశాల రూపు రేఖలు మారిపోయాయన్నారు. ఉంగుటూరు ఎంఇఒ-2 వెంకట్రావు, విశ్రాంత ఉపాధ్యాయులు రామకృష్ణ, ఉప్పిలి వెంకటేశ్వరరావు, పమ్మి సోమయాజులు, ముప్పిడి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యా యులు, వంట ఏజెన్సీలు, అంగన్‌వాడీలు, విద్యార్థుల తల్లిదం డ్రులు ఆనందరావు వెంకట రమణ దంపతులను దుశ్శాలువతో సత్కరించారు.

6న కలెక్టరేట్ వద్ద ధర్నా

రైతు సంఘం, కోకో రైతు సంఘం నేతలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

కోకో గింజలను అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కొనుగోలు చేయాలని, కిలో గింజలకు రూ.900 ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న కోకో రైతులు చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు తెలిపారు. మండలంలోని పంగిడిగూడెం, సూర్యచంద్రరావు పేట, గొల్లగూడెం, తిమ్మాపురం, ద్వారకాతిరుమల తదితర గ్రామాల్లో బుధవారం చలో ఏలూరు కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలకు రూ.900 వరకు ధర ఉన్నా ప్రస్తుతం కోకో గింజల కొనుగోలు కంపెనీలు ఆ ధర చెల్లించడం లేదన్నారు. 6న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు, కలెక్టర్‌కు రాయబార కార్యక్రమానికి అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కొబ్బరి రైతుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు బొల్లు రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు గుది బండి రమేష్ రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

విద్యావంతుడు, నిజాయితీ గల నందిగం సీతారం తిలక్

ఎంఎసి ఛైర్మన్ పదవి ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - చింతలపూడి



చంద్రబాబుతో సీతారంతిలక్ (బాబి)

నందిగం సీతారాం తిలక్ (బాబి) కుటుంబానికి టిడిపి అంటే ఎనలేని మక్కువ అని, 1983 నుంచి పార్టీలోనే ఉంటూ ఎన్ని అడ్డంకులు వచ్చినా చంద్రబాబుపై మక్కువతో ఆయన ఆదేశాలు తూచ తప్పకుండ పాటిస్తూ ఉన్నారని టిడిపి జిల్లా కార్యదర్శి చెరువుగట్టు రామ్మోహన్‌రావు, పార్టీ నాయకులు కొమ్ము తిరుపతిరావు చెప్పారు. పార్టీకి విధేయులుగా, కార్యకర్తలకు అండగా ఉంటున్న చదువుకున్న వ్యక్తి నందిగం సీతారాం తిలక్ (బాబి)కి చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ లింగపాలెం మండలం కలరాయనగూడేనికి చెందిన నందిగం సీతారాం తిలక్‌కు ఎఎంసి ఛైర్మన్ పదవి ఇవ్వాలని పార్టీ నాయకులు బలంగా కోరుకుంటున్నారన్నారు. 1983 నుంచి 2021 వరకు చింతలపూడి నియోజకవర్గంలో ఎంపిటిసి, జెడ్‌పిటిసి, సర్పంచి పదవులు చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. అప్పటి మంత్రి టిడిపిని వీడినా ఒక్క కార్యకర్త కూడా పార్టీని వీడకుండా చూసుకున్న ఘనత నందిగం కుటుంబానికి చెందుతుందన్నారు. నందిగం నాగేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తరువాత ఆయన కుమారుడు నందిగం బాబి కార్యకర్తలకు అండగా ఉన్నారన్నారు.

ఉన్నత విద్యావంతుడు బాబికి ఎఎంసి ఛైర్మన్ ఇవ్వాలని టిడిపి నాయకులు, కార్యకర్తలు బలంగా కోరుకుంటున్నారన్నారు. నందిగం కుటుంబం 42 ఏళ్లుగా పార్టీని నమ్ముకుని ఉందని, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. 2001లో జెడ్‌పిటిసి నందిగం కుటుంబానికి ఇచ్చారని, ఆనాడు కోటగిరి విద్యాధరరావు పార్టీ మారినప్పుడు చంద్రబాబు సూచనలతో చింతలపూడి నియోజకవర్గ పార్టీ కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకురావడంలో నందిగం కుటుంబం కీలక పాత్ర పోషించిందన్నారు. జిల్లా తెలుగు యువత అధ్యక్ష పదవి పోటీల్లో చంద్రబాబు దృష్టిలో బాబి మంచి స్థానం సంపాదించుకున్నారన్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో విజయానికి తనదైన శైలిలో కృషి చేశారని తెలిపారు. చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ పదవికి ముందు వరుసలో నిల్చున్న నాయకులు బాబి అని చెప్పారు. సిఎం చంద్రబాబు యువకులకు అవకాశం ఎక్కువగా ఇస్తున్నారని, బాబి వంటి యువకులకు అవకాశమిస్తే చింతలపూడి నియోజ కవర్గంలో టిడిపిని మరింత బలోపేతం చేస్తారని భావిస్తున్నామన్నారు. నియోజకవర్గ స్థాయిలో నందిగం బాబి పేరు తెలియని వారు లేరని, రాష్ట్ర స్థాయిలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నారని తెలిపారు. పార్టీని నమ్ముకున్న కుటుంబానికి పార్టీ పెద్దలు న్యాయం చేయాలని కోరుతున్నారు. నందిగం కుటుంబానికి ఎఎంసి ఛైర్మన్ ఇవ్వాలని కోరుతున్నారు.

గీత కార్మికుల మద్యం షాపులకు నేడు లాటరీ

ప్రజాశక్తి - మండవల్లి

గీత కార్మికుల షాపునకు దరఖాస్తు చేసుకున్నవారు గురువారం కలెక్టర్ కార్యాలయానికి రావాలని ఎక్సైజ్ శాఖ సిఐ షేక్ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో గీత కులాల షాపు నిర్వహించుకునేందుకు అనుమతులు వచ్చాయని పేర్కొన్నారు. గీత కుల షాపు నిర్వహించుకునే విధంగా 12 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. గురువారం ఏలూరు కలెక్టరేట్‌లో గోదావరి మీటింగ్ హాలులో కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా తీయనున్నట్లు తెలిపారు. డ్రాలో గెలుపొందిన వారు రెండేళ్ల కాల పరిమితితో షాపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - చింతలపూడి

ఐదో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు, ఇంటర్ మొదటి, డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశ పరీక్షకు ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చని నాగిరెడ్డిగూడెం ఎపిఆర్ బాలికల స్కూల్ ప్రిన్సిపల్ మండలి బ్రాహ్మణేశ్వరమ్మ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. ఐదు నుంచి ఎనిమిదో తరగతులకు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని, ఇంటర్, డిగ్రీ ప్రథమ సంవత్సరాలకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. చింతలపూడి నాగిరెడ్డిగూడెం బాలి కల పాఠశాలలో విశాలమైన తరగతి గదులు, సువిశాలమైన ఆటస్థలం ఉన్నారు. విద్యార్థులకు క్రీడల ద్వారా ఆనందం, యోగాతో ఆరోగ్యం ఉంటుందన్నారు. ఆరోగ్య పరమైన, ఆహ్లాదకరమైన మౌలిక వసతులు, 24 గంటల విద్యార్థుల సంరక్షణ, అర్హులైన, అనుభవిజ్ఞులైన ఉపాధ్యా యులచే విద్యాబోధన ఉంటుందని తెలిపారు. సంబంధిత ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా కేటగిరిలో నిర్దేశించిన రిజర్వేషన్ పాటిస్తూ సీట్లు కేటాయింపు ఉంటుందని తెలిపారు.

'నియోజకవర్గ అభివృద్ధే చిర్రి బాలరాజు ధ్యేయం'

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు పోలవరం నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని జనసేన మండల నాయకులు అన్నారు. వేలేరుపాడులోని జనసేన మండలాధ్యక్షులు గణేశుల ఆదినారాయణ నివాసంలో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతూ పరిష్కార దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అసెంబ్లీలో తనకిచ్చిన సమయాన్ని చాలా సమయస్ఫూర్తితో వృథా చేయకుండా సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేయడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు మేచినేని సంజయ్, పట్టాల సత్తిబాబు, క్రాంతికుమార్, శివరామ్, పోట్ల మోహన్, సుధాకర్, భాను, వంశీ, కళ్యాణ్, సాయి, బాబు, కమ్మచిచ్చు కిరణ్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటిని కలిసిన కూటమి నాయకులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఉమ్మడి కృష్ణా- గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను బుధవారం ముదినేపల్లి మండల కూటమి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గుంటూరులోని ఆలపాటి రాజేంద్రప్రసాద్ కార్యాలయం వద్ద ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసిన వారిలో కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కో కన్వీనర్ కొడాలి వినోద్, మాజీ ఎంపిపి పోసిన పాండురంగారావు, తెలుగుయువత అధ్యక్షుడు దావు నాగరాజు, గుడివాడ గణేష్, గజ్జల గణేష్, యర్రా రాంబాబు తదితరులు ఉన్నారు.

కూటమి నేతల సంబరాలు

ప్రజాశక్తి - భీమడోలు

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎంఎల్‌సిగా ఎన్నికైన పి.రాజశేఖరం విజయానికి కృషి చేసిన పట్టభద్రులకు, కూటమి నాయకులకు టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు భీమడోలులోని టిడిపి కార్యాలయంలో కూటమి పక్షాల నాయకులు విజయోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. రాజశేఖరం విజయానికి కృషి చేసిన గన్ని వీరాంజనేయులును వారు ప్రత్యేకంగా అభినందించారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.